‘ఉపాధి’లో వసతులు కరువు



తెల్లరాళ్లపల్లితండాలో ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

- పనుల వద్ద కనిపించని గుడారాలు, తాగునీరు
- అవస్థలు పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు

పాన్‌గల్: కూలీలకు ఉన్న గ్రామంలోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. దీనిని విజయవంతంగా కొనసాగించేందుకు సాంకేతికతను అమలులోకి తీసుకొచ్చింది. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధి కూలీల ఫొటోలను ఉదయం పని ప్రదేశం నుంచే తీసి పోర్టల్‌లో నమోదు చేయడం.. పూర్తయిన తర్వాత మళ్లీ ఫొటో తీసి నిక్షిప్తం చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అలాగే గతంలో రోజుకు సరాసరి కూలీ రూ.242 చెల్లిస్తుండగా.. రూ.250కి పెంచింది. తాజాగా మరో రూ.15 పెంచుతూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అంతా బాగానే ఉన్నా.. పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కరువై ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. మండలవ్యాప్తంగా 15,600 జాబ్‌కార్డులు ఉండగా.. 5,700 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. రోజు 2,105 మంది కూలీలు పనులకు వస్తున్నారు. రోజుకు రూ.185 మాత్రమే కూలి పడుతుందని అధికారులు తెలిపారు.



నీడ లేక ఎండలో కూర్చున్న కూలీలు (ఫైల్)

కనిపించని వసతులు..

పని ప్రదేశాల్లో నీడ కోసం గతంలో సమకూర్చిన టెంట్లు పనికి రాకుండా పోయాయి. మళ్లీ వాటి మంజూరుకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. తప్పని పరిస్థితుల్లో కాసేపు సేద తీరడానికి చెట్లను ఆశ్రయించాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. అలాగే తాగునీటి కోసం ప్రత్యేకంగా ఒక కూలీని నియమించేవారు. దానిని తొలగించి ఒక వ్యక్తికి రూ.5 ఇచ్చేవారు. దీంతో ఇంటి నుంచే నీళ్లను సీసాల్లో తెచ్చుకుంటున్నారు. కానీ తాగునీటి ప్రోత్సాహకం ఊసే లేదు.. పని చేసినందుకు మాత్రమే కూలీ ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ ఇక్కట్లు తీర్చాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీడ, నీటి వసతులు కల్పించాలన్న నిబంధన ఉన్నా.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

వసతులు కల్పించాలి..



ప్రస్తుతం ఎండ తీవ్రంగా ఉంది. పనుల వద్ద టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాట్లను అధికారులు విస్మరించారు. గతంలో పనుల వద్ద వసతులు కల్పించేవారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– గుమ్మ, ఉపాధి కూలీ, తెల్లరాళ్లపల్లితండా

కూలీలను పట్టించుకోని అధికారులు



పని ప్రదేశంలో కూలీలకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తామని అధికారులు చెబుతున్నా.. ఎక్కడా అమలుకు నోచుకోకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పనుల వద్ద వసతులు కల్పించాలి.

– బాల్యానాయక్, సీపీఎం నాయకుడు, పాన్‌గల్

సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నాం..



పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సంబంధిత పంచాయతీల ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బందికి ఇప్పటికే తెలియజేశాం. సౌకర్యాల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. తాజాగా పెంచిన రూ.15కు సంబంధించిన ఆదేశాలు ఇప్పటికీ రాలేదు.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

కొత్తకోట రూరల్: మండల కేంద్రానికి చెందిన ఈశ్వరయ్య (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మేఘారెడ్డి తక్షణ సాయంగా రూ.5 వేలు పంపించారు. టీఎంఆర్ యువజన సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, నరేష్, టైలర్ రవి, దర్శన్, కురుమూర్తి, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ నాయకులు



వీపనగండ్ల: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనను విజయవంతం చేసేందుకు మండలంలోని పలు గ్రామాల బీజేపీ నాయకులు శనివారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ నిరసన

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు ఉన్న రహదారిపై డివైడర్ పనులు కొనసాగుతున్నాయి. అంబేడ్కర్ చౌరస్తా నుంచి కాస్త ముందుకెళ్లగానే భగత్‌సింగ్‌నగర్, బస్టాప్ ఉన్నాయని.. 12 అడుగుల మేర డివైడర్ నిర్మాణం వద్దని కౌన్సిలర్ చీర్ల సత్యంసాగర్ విన్నవించగా.. ఏఈ రాజేశ్ ఒప్పుకోలేదు. దీంతో చేసేది లేక డివైడర్ మిషన్‌కు అడ్డంగా బైక్ ఉంచి శనివారం నిరసన తెలిపారు. పనులు నిలిచిన విషయం తెలుసుకున్న డీఈ దానయ్య అక్కడికి చేరుకొని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కౌన్సిలర్ ఆందోళన విరమించారు.

రెండోరోజు కొనసాగిన బండలాగుడు పోటీలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద శనివారం రెండోరోజు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులు బండను లాగాయి. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులు ఆడుకునేందుకు జారుడు బండ, మోటార్ బైక్, జంపింగ్ స్టాండ్ ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



అమరచింత: పదోతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తహసీల్దార్ సింధుజ అన్నారు. ఆత్మకూర్‌లోని 3 పరీక్ష కేంద్రాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం 636 మంది విద్యార్థులకుగాను 634 మంది హాజరుకాగా.. బాలుర ఉన్నత పాఠశాల, జాతర మైదానం పాఠశాలలో ఒక్కొక్కరు గైర్హాజరయ్యారు. అమరచింతలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 308 మందికిగాను అందరు విద్యార్థులు హాజరయ్యారు. ఆమె వెంట ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ స్వామి ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్‌యాదవ్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నాలుగో తరగతి విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్ష కోసం, 5వ తరగతి విద్యార్థులకు సాయంకాలం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంను అభినందిస్తున్నారు.



అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



గోడలను తొలగిస్తున్న పుర సిబ్బంది

అమరచింత: పురపాలిక అనుమతి లేకుండా పట్టణంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో జన్నుపాండు తన ఇంటి ముందున్న రహదారిని అనుసరించి మరుగుదొడ్డి నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని.. అధికారుల అనుమతితో పనులు ప్రారంభించాలని సూచించారు.

బాధితుల ఆందోళన..

మరుగుదొడ్డి నిర్మాణాన్ని కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని బాధిత కుటుంబ సభ్యులు పుర కమిషనర్‌తో వాదనకు దిగారు. ఇంటి ఆవరణలో కచ్చితంగా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా.. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలు వార్డుల్లో డ్రెయినేజీలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక అధికారులు నిర్మాణానికి సహకరించకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్

వనపర్తి: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శ్రీధర్ అన్నారు. శనివారం రాత్రి జిల్లాకేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్‌లో శ్రీ గురురాఘవేంద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్ శ్రీధర్ భారతి సిమెంట్ నాణ్యత, పాటిస్తున్న సాంకేతిక ప్రమాణాలను వివరించారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతంగా పూర్తికావడంతో పాటు పటిష్టంగా ఉంటుందని డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించి చూపించారు. స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని చెప్పారు. జిల్లాకేంద్రంలోని 140 మంది తాపీమేస్త్రీలకు సంస్థ నుంచి ఉచితంగా రూ. లక్ష విలువగల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు ఆయన వివరించారు. యాదాద్రితో పాటు ఆలేరు, వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్‌ను వినియోగించినట్లు తెలిపారు. మార్కెటింగ్ అధికారి విజయ్‌బాబు, వనపర్తి భారతి సిమెంట్ డీలర్ మోహన్, సీనియర్, జూనియర్ తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.



తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా రసీదులను అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ శ్రీధర్, డీలర్ మోహన్

పోడు భూముల రీ సర్వే

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గిరిజన తండాల్లో ఉన్న పోడు భూములను మండల అధికారులు శనివారం రీ సర్వే చేశారు. గతంలో సర్వే చేసినప్పటికీ సుమారు 279 మంది గిరిజనులు తమ భూములు సర్వే చేయలేదని.. జాబితాలో తమ పేర్లు లేవని ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం రెండోసారి దొంతికుంటతండా, కోతులకుంటతండా, రుక్కన్నపల్లితండాల్లో సర్వే చేసినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్, మండల సర్వేయర్ షఫీ తెలిపారు. పూర్తిస్థాయి సర్వే నివేదికను ఉన్నతాధికారులను అందజేయనున్నట్లు వివరించారు. సర్వేలో ఫారెస్టు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



దొంతికుంటతండాలో సర్వే చేస్తున్న అధికారులు

ఆవిర్భావ హామీలు అమలుచేయాలి

అమరచింత: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ సీపీఎం నాయకులు పట్టణంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన ఉద్యాన యూనివర్సిటీ మంజూరు చేయాలన్నారు. బయ్యారం, సింగరేణి గనుల ప్రైవేటీకరణ మానుకోవాలని కోరారు. రాష్ట్రంలో వసూలైన జీఎస్టీ నిధులను తిరిగి ఇవ్వాలన్నారు. వందేభారత్ రైళ్లలో ఛార్జీలు తగ్గించాలని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, రవి, ప్రకాష్, సుజ్ఞానం, చందు, శంకర్, ఫయాజ్, వినోద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జేష్టాదేవి సమేత శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో వెలసిన జేష్టాదేవి సమేత శనేశ్వరుడికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శనిదోష నివారణ కోసం భక్తులు సూర్యోదయం కంటే ముందుగా ఆలయానికి చేరుకుని తిలతైలాభిషేక, గోత్రనామార్చన, ప్రదక్షిణలు వంటి కార్యక్రమాలు భక్తుల చేత జరిపించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. అనంతరం సమీపంలోని బ్రహ్మసూత్ర పరమశివుడిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



‘సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం’



టీడీపీ జెండాను ఎగరవేస్తున్న డా. పగిడాల శ్రీనివాస్

వీపనగండ్ల: రాష్ట్రంలో సంక్షేమ పాలన తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని.. రాబోయే ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు డా. పగిడాల శ్రీనివాస్ అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కల్వరాలలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఇల్లిల్లూ తిరిగి పార్టీని గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దుచేసి పేదలకు రూ.2కే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల గుండెల్లో పార్టీ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుందని వివరించారు. నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించిన తనను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే అహర్నిశలు పనిచేసి అభివృద్ధి చేస్తానన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ హోటల్ సుధాకర్, పార్టీ యువ నాయకులు డా. పగిడాల సాయిధీరజ్, అడ్వకేట్ అజయ్‌కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ రామస్వామి, నాయకులు తెలుగు శ్రీను, హోటల్ వెంకటేష్, చక్రపాల్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, తోట ఈశ్వరయ్య, రామచంద్రయ్య, బాల్‌వెంకటయ్య, విష్ణు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘బాలచెలిమి’ పుస్తకాల వితరణ



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం బాల చెలిమి చిల్డ్రన్స్ అకాడమీ, హైదరాబాద్ వారు కథల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న విజయకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులతో కథలు చదివించడంతో భాషా నైపుణ్యం పెరగడంతో పాటు నీతి గ్రహించి పఠన ఆసక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతాయన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి కథల పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గట్టయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

కొత్తకోట: పట్టణంలోని ఆరోగ్య క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకుడు శేఖర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు ఉంటుందని.. ఆసక్తిగల జట్లు సెల్‌ఫోన్ నంబర్లు శేఖర్‌గౌడ్‌-9492175320, నవీన్‌-9966071291, మహేష్‌-9885899113, సందీప్‌-9398054693 సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు బాలస్వామి అతడి అనుచరులు 10 మందితో కలిసి శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి నిరంజన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ సమష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సురేష్‌కుమార్, సర్పంచ్ సిద్దయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి సభ్యుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మోదుగ విస్తరాకుల పరిశ్రమను ఈజీఎస్‌కు అనుసంధానం చేయాలి..

వనపర్తి: తెలుగు కులస్తులు ఎక్కువగా తయారుచేసే మోదుగ విస్తరాకుల తయారీ పరిశ్రమను ఉపాధిహామీకి అనుసంధానం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మంత్రి నిరంజన్‌రెడ్డిని కోరారు. శనివారం మోదుగ విస్తరాకులు తయారు చేసే మన్యంతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అనుసంధానం చేయించేందుకు ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు.



మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పుర పాలకవర్గం, బీఆర్‌ఎస్ నాయకులు

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం..

పెబ్బేరు: వివాదంలో ఉన్న స్థానిక సంత స్థలం 16 ఎకరాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పురపాలికకు అప్పగించడంతో శనివారం ఆయన చిత్రపటానికి పుర పాలకవర్గం, బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక చౌరస్తాలో పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చారు. అలాగే చౌరస్తా నుంచి డప్పులతో సంత వరకు ర్యాలీగా వెళ్లి వ్యాపారులు, వినియోగదారులకు ఎప్పటిలాగే ఇక్కడే సంత కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, శ్రీరంగాపూర్ ఎంపీపీ గాయత్రి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, గోపిబాబు, మేకల సుమతి, గుడిసె పద్మ, నాయకులు దిలీప్‌కుమార్‌రెడ్డి, వనం రాములు యాదవ్, వెంకటేష్, కురుమూర్తి, సాయినాథ్, బాలరాంనాయుడు, సంబు రాములు, భారతి, జ్యోతి, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో దోపిడీ పాలన : కాంగ్రెస్

మదనాపురం: తెలంగాణలో దోపిడీ పాలన కొనసాగుతోందని.. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గోవిందహళ్లిలో హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఉచిత విద్యుత్, ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ హస్తం పేరుతో రేషన్ దుకాణాల్లో 9 రకాల నిత్యావసర సరుకులు, 108, 104 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం కింద ఎత్తిపోతల పథకాలు నిర్మించామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంజద్‌అలీ, మహేష్, రామచంద్రయ్య, నరోత్తంరెడ్డి, ఆవుల రాఘవేంద్ర యాదవ్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మంగరాయల శివ, కావలి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోవిందహళ్లిలో పార్టీ జెండా ఎగురవేసి నినాదం చేస్తున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

సీపీఐ నాయకుల నిరసన



పాన్‌గల్‌లో..



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ నాయకులు శనివారం మండలంలోని కేతేపల్లి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, హన్మకొండలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు నేటికీ నెరవేరలేదన్నారు. తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టు ఇవ్వకపోవడం, సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ ప్రధాని రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నట్లు వివరించారు. అలాగే విద్యుత్, ఎల్‌ఐసీ, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులులాంటి లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు విక్రయించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుద్వారా గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, కుతుబ్, సీపీఐ నాయకులు కుర్మయ్య, పెద్దహన్మంతు, చిన్నకుర్మయ్య, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలుచేయాలి..

అమరచింత: పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన విభజన హామీలను ప్రధాని మోదీ ఎందుకు అమలు చేయడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు రాబర్ట్, మోషా, లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. శనివారం ఆత్మకూర్, అమరచింతలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీపీఐ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఏమయ్యాయని ప్రశ్నించారు. వైద్య కళాశాలలు, నవోదయ పాఠశాలలు కొత్తవి మంజూరు చేయలేదన్నారు. కేసీఆర్, మోదీ మధ్య ఉన్న విభేదాలతో రాష్ట్ర ప్రజలను బలి చేయటం సరికాదని వివరించారు. ప్రజాస్వామ్య వ్యతిరేక, నియంతృత్వ పోకడలను వీడాలని సూచించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నర్సింహశెట్టి, భీమన్న, లింగన్న, గోవర్ధన్, ఆంజనేయులు, చెన్నప్ప, అబ్రహం, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

‘సదరం’ సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి వారం నిర్వహించే సదరం శిబిరాన్ని మండలంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు సదరం ధ్రువపత్రాలు పొందని వారు.. పునరుద్ధరించుకొనే వారు దగ్గర్లోని మీ–సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని సూచించిన తేదీల్లో జిల్లా ఆస్పత్రిలోని సంబంధిత వైద్యుడితో వికలత్వ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని సదరం ధ్రువపత్రం పొందవచ్చని పేర్కొన్నారు. శిబిరాన్ని వచ్చే సమయంలో ఆధార్‌కార్డు జిరాక్స్, మీ–సేవా రసీదు, పాత సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని సూచించారు. 10వ తేదీ సాయంత్రం నుంచి స్లాట్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.